క్లుప్తంగా

నేటి నుంచి విద్యుత్ బిల్లుల వసూలు కౌంటర్ పునరుద్ధరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం సత్యనారాయణపురం జి.ఎస్.రాజు రోడ్డు వాటర్ ట్యాంక్ సమీపంలోని ముత్యాలంపాడు సబ్ స్టేషన్‌లో బిల్లులు కట్టించుకునే కౌంటర్‌ను మంగళవారం నుంచి పునరుద్ధరించనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీవీ సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కౌంటర్‌లో ఆది, మంగళ, గురువారాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చునన్నారు. మిగిలిన రోజుల్లో శ్రీనగర్ కాలనీ డ్రెయినేజీ పంపింగ్ స్టేషన్ సమీపంలోని విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం మూడున్నర గంటల వరకు బిల్లులు చెల్లించు వచ్చునని తెలిపారు. ముత్యాలంపాడు సెక్షన్ పరిధిలోని సత్యనారాయణపురం, శ్రీనగర్ కాలనీ, లక్ష్మీనగర్, అయోధ్యనగర్ రామలింగేశ్వరపేట, లోటస్ ల్యాండ్ మార్క్ తదితర ప్రాంతాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

29న దత్తసాయి పీఠంలో తొలిఏకాదశి పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ఈనెల 29వ తేదీ గురువారం శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన తొలిఏకాదశి పూజలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 29వ తేదీ తెల్లవారుజామున 4 గంటలకు పంచామృత అభిషేకంతో తొలిఏకాదశి పూజలు ప్రారంభమవుతాయన్నారు. స్వామివారికి విశేషంగా పూజలు, అభిషేకాలు వేదపండితులచే జరుగుతాయన్నారు. సాయంత్రం 6.30 గంటలకు శ్రీ దేవీ, పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని స్వామి కృపకు పాత్రులు కావాల్సిందిగా ఆయన కోరారు.

జంతు పరిరక్షణ అధికారిగా హనుమంతరావు

విజయవాడస్పోర్ట్స్: జంతు పరిరక్షణ జిల్లా నోడల్ అధికారిగా ఏసీపీ డాక్టర్ కె.హనుమంతరావును నియమించినట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో జంతువులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు నోడల్ అధికారిని నియమించామన్నారు. జిల్లాలో ఎక్కడైనా జంతు హింస జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే 94406 27090 మొబైల్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సీపీ కోరారు.

బెజవాడలో ఒకే రోజు ఆరుగురు అదృశ్యం

- సింగ్‌నగర్‌కు చెందిన ఓ తల్లి, ఇద్దరు బిడ్డలు
- అయోధ్యనగర్‌కు చెందిన మరో తల్లి, ఇద్దరు బిడ్డలు అదృశ్యం
- రెండు ఘటనల్లోని వారూ ఆటో డ్రైవర్ల భార్యా బిడ్డలే

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నగరంలో ఒకే రోజు ఆరుగురు అదృశ్యమయ్యారు. సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వేర్వేరు ప్రాంతాలకు చెందిన వారు ఆచూకీ లేని వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్ ప్రాంతానికి చెందిన గొరెడ్డి వెంకట్ ఆనంద్‌కు భార్య, ఇద్దరు మగ పిల్లలు, ఒక ఆడపిల్ల సంతానం ఉన్నారు. ఆటో నడుపుకునే వెంకట్ ఆనంద్ రోజు మాదిరిగానే ఆదివారం తన పనులకు వెళ్లిపోగా భార్య గొరెడ్డి భవాని(33) తన చిన్న కుమారుడు వసంతబాబు(10),కుమార్తె హిమజ(12)ల ను తీసుకొని న్యూ రాజరాజేశ్వరీపేటలో ఉంటున్న తన పుట్టింటికి వెళ్లివస్తానని పెద్ద కుమారుడికి చెప్పి ఈ నెల 25న ఆదివారం రాత్రి ఇంటి నుంచి వెళ్లింది. పనులు ముగించుకొని ఇంటికి వచ్చిన వెంకట్ ఆనంద్ అమ్మ, తమ్ముడు, చెల్లి గురించి పెద్ద కుమారుడిని అడగ్గా అమ్మమ్మ వాళ్ల ఇంటికి వెళ్లారని చెప్పాడు. అతను తన అత్తవారికి ఫోను చేసి ఆరా తీయగా వారు అక్కడకు రాలేదని చెప్పారు. దీంతో అనుమానం వచ్చిన అతను తన భార్య, పిల్లల కోసం వారి బంధువులు, స్నేహితులు, చుట్టుపక్కల ప్రదేశాల్లో వెతికాడు. ఆచూకీ లభించకపోవడంతో సోమవారం పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకూ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చర్చికి వెళ్లి వస్తానని చెప్పి...

అయోధ్యనగర్, శాంతినగర్ జీరో లైన్‌కు చెందిన కంతేటి కిరణ్‌కుమార్ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య కంతేటి స్వప్న(36), కుమారుడు కంతేటి రూపేశ్వర్(15), కుమార్తె కంతేటి కుసుమ(11) ఉన్నారు. ప్రకాశం జిల్లాకు చెందిన వీరు రెండు నెలల క్రితమే అయోధ్యనగర్‌కు వచ్చి అద్దె ఇంటిలో ఉంటున్నారు. ఈ నెల 25న ఆదివారం ఉదయం 11 గంటలకు చర్చికి వెళ్లివస్తామని చెప్పి స్వప్న తన ఇద్దరు పిల్లలను తీసుకొని వెళ్లింది. ఎంతసేపటికీ వారు తిరిగి ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన ఆయన వారి కోసం చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం అతను సింగ్‌నగర్ పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే విష్ణు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గుణదల(విజయవాడతూర్పు): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. గుణదల 1వ డివిజన్, 238వ సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ.. సంక్షేమమే పరమావధిగా సీఎం వైఎస్ జగన్ పాలన అందిస్తున్నారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే ప్రజల నాడీ తెలిసిన నాయకుడిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేరుతెచ్చుకున్నారని కొనియాడారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడంలో ఆయన సఫలీకృతమయ్యారన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశానికే ఆదర్శవంతంగా నిలిచిందని చెప్పారు. తమ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావడానికి ఈ సంక్షేమ పథకాలే దోహదపడతాయని తెలిపారు. వలంటీర్లు నిబద్ధతగా పనిచేసి అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని సూచించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు తెలియచేసిన సమస్యల దృష్ట్యా ఖాళీ స్థలాల్లో పెరిగిపోయిన పిచ్చి మొక్కలను తొలగించి పారిశుద్ధ్య పనులు మెరుగుపరచాలని శానిటేషన్ సిబ్బందికి సూచించారు. రోడ్లపై పారుతున్న మురుగునీటిని అదుపు చేసే దిశగా డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలని ఆదేశించారు. కార్యక్రమంలో వీఎంసీ డీఈ రామకృష్ణ, సీడీవో జగదీశ్వరి, కార్పొరేటర్లు ఉద్దంటి సునీత, కొంగితల లక్ష్మీపతి, వైఎస్సార్ సీపీ నాయకులు కొండా మహేశ్వరరెడ్డి, ఆళ్ల ప్రసాద్ రెడ్డి, బండి వేణు, ఉద్దంటి సురేష్, కొలకలేటి రమణి తదితరులు పాల్గొన్నారు.

లోకేష్, పవన్‌లకు మతి భ్రమించింది..

జనసేన అధినేత పవన్ కళ్యాణ్, నారా లోకేష్ లకు మతి భ్రమించిందని ఎమ్మెల్యే విష్ణు ధ్వజమెత్తారు. ఆయా అసెంబ్లీ స్థానాల్లో పోటీచేసి ఓడిపోయిన ఈ నేతలు సీఎం జగన్ గురించి మాట్లాడే అర్హత లేదని స్పష్టం చేశారు. సత్తా ఉంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీతో పాటు జనసేన పార్టీ సైతం భూస్థాపితం కాక తప్పదన్నారు. ఆయా పార్టీ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలని ఎమ్మెల్యే విష్ణు హితవు పలికారు.

అర్హులందరికీ పథకాలు అందించడమే లక్ష్యం



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ అనిత, స్పెషలాఫీసర్ నరసింహమూర్తి

లబ్బీపేట(విజయవాడతూర్పు): అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత అన్నారు. ఆమె సోమవారం స్పెషలాఫీసర్ నరసింహమూర్తి, సచివాలయ సిబ్బందితో కలిసి, 88, 91 సచివాలయాల పరిధిలోని గిరిపురం, కస్తూరిభాయిపేటలోని ఇంటింటికీ సందర్శించారు. ఈ సందర్భంగా ఏదైనా కారణంగా సంక్షేమ పథకాలు అందని వారికి గుర్తించి వారి వివరాలు నమోదు చేశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమన్నారు. అందులో భాగంగానే పథకాలు అందని వారికి గుర్తించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఇది ప్రజల ప్రభుత్వమని, ప్రతి ఒక్కరికీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎక్సెల్ ప్లాంట్ పరిశీలన



ఎక్సెల్ ప్లాంట్‌లో సిబ్బందికి సూచనలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): అజిత్ సింగ్‌నగర్‌లోని ఎక్సెల్ ప్లాంట్‌ను నగరపాలకసంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం ఉదయం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్లాంట్‌లో జరుగుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకొని అధికారులకు పలు సూచనలు చేశారు. ప్లాంట్ ఆవరణలో ఉన్న ట్రీ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్, టౌన్ ప్లానింగ్ సెక్షన్ స్క్రాప్, స్క్రాప్ ప్లేసింగ్ యూనిట్, ఆఫీస్ బిల్డింగ్, మాట్రెస్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్, సి-డి వేస్ట్ రీసైక్లింగ్ యూనిట్, వెహికల్ పార్కింగ్ వంటి ప్రదేశాలను పరిశీలించారు. ఎక్సెల్ ప్లాంట్‌కు రోజుకు వచ్చే చెత్త వివరాలను సిస్టమ్‌లో తనిఖీ చేసి చెత్త వేయింగ్ (వే బ్రిడ్జి) పనితీరును పర్యవేక్షించారు. ఎంట్రన్స్ గేటు దగ్గర జరుగుతున్న పనులను పరిశీలించారు. పార్కింగ్ ఫ్లోరింగ్ రాళ్లను ఎంట్రన్స్ గేటు దగ్గర ఏర్పాటు చేయాలని, ప్లాంట్ ఆవరణలో జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంలో ప్లాంట్ ఆవరణలో ఆహ్లాదకరంగా ఉండే విధంగా గ్రీనరీ పెంపొందించుటకు చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏ.ఎస్.ఎన్ ప్రసాద్, ఏడీహెచ్ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

టైలరింగ్ సర్టిఫికెట్ల అందజేత

పటమట(విజయవాడతూర్పు): మహిళలు ఆర్థిక ప్రగతి సాధించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని హెచ్‌సీఎల్ ఫౌండేషన్ విజయవాడ ప్రాజెక్ట్ ఆఫీసర్ బి.శ్రీనివాస్ తెలిపారు. వాసవ్య మహిళా మండలి సిల్వర్ జూబ్లీ హాల్‌లో వాసవ్య మహిళా మండలి హెచ్‌సీఎల్ ఫౌండేషన్ వారి సహకారంతో అమ్మ ప్రాజెక్టులో భాగంగా రెండు బ్యాచ్‌లలో టైలరింగ్ నందు శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. వాసవ్య మహిళా మండలి వారితో కలిసి గత ఐదేళ్లుగా హెచ్‌సీఎల్ ఫౌండేషన్ ఎన్నో మహిళా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. మహిళలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దుతూ వారికి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు, చిరు వ్యాపారులకు వ్యాపార నిమిత్తం సహాయం, మహిళా మిత్ర వంటి కార్యక్రమాల ద్వారా ఎన్నో విధాలుగా సేవలు అందిస్తున్నామని చెప్పారు. వాసవ్య మహిళా మండలి సెక్రటరీ జి.రష్మీ సమరం మాట్లాడుతూ 54 ఏళ్లుగా వాసవ్య మహిళా మండలి సమాజంలో మహిళలకు నైపుణ్యత శిక్షణ కార్యక్రమాల ద్వారా వారి జీవనోపాధిని మెరుగుపర్చడంలో ముందడుగు వేశామని చెప్పారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో వివిధ ప్రాజెక్టుల ద్వారా ఎంతో మందికి చేయూతనందించామన్నారు. అనంతరం వీరికి సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బెంజ్ సర్కిల్ బ్రాంచ్ మేనేజర్ మనీషా ఠాకూర్, వాసవ్య మహిళా మండలి బృందం, శిక్షణ విద్యార్థులు పాల్గొన్నారు.

సత్వర న్యాయం చేసేందుకే 'జగనన్న సురక్ష'



సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ తదితరులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నిరుపేదల అభ్యున్నతి కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సత్వరమే అందించాలనే ప్రధాన లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టామని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సింగ్‌నగర్ 59వ డివిజన్‌లోని గుజ్జల సరళాదేవి కల్యాణ మండపంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమంపై వార్డు సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు, కన్వీనర్లు, గృహ సారథులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు.

అగ్రగామిగా నిలపాలి..

కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సచివాలయ వ్యవస్థ ద్వారా దేశ చరిత్రలోనే తొలిసారి ప్రజల వద్దకు పాలన చేరువ చేసి, ప్రజలకు పెద్ద ఎత్తున సంక్షేమాన్ని అందించిన ఘనత మన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అర్హత ఉండి సాంకేతిక లోకాలతో లబ్ధి పొందని వారికి కూడా సత్వరే ఆయా పథకాలు అందేలా చేసి వారిని కూడా సంతృప్తి పరచాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. సచివాలయ పరిధిలో పనిచేసే ప్రతి ఒక్కరూ ఈ బృహత్కర కార్యక్రమానికి తమవంతు సహకారం అందించి, అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని సూచించారు. సంక్షేమాభివృద్ధిలో ముందంజలో ఉన్న సెంట్రల్ నియోజకవర్గాన్ని జగనన్న సురక్షలోనూ అగ్రగామిగా నిలిపే దిశగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచి ప్రతి క్షణం ప్రజల్లోనే ఉంటూ ప్రజలతోనే మమేకమవుతూ ఉన్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని అన్నారు. 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహీనా సుల్తానా, నాయకులు నందెపు సురేష్, ఎండీ హఫీజుల్లా, దేవిరెడ్డి రమేష్‌రెడ్డి, కంభగళ్ల రాజు, పిల్లి లక్ష్మి, కొండా జయలక్ష్మి, చింతా శ్రీను, అమిత్, షఫీ, షేక్ వెంకట్, కృష్ణ, కోలా శాంత కుమారి పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఫస్ట్ ర్యాంక్ సాధనకు సహకరించాలి



మైక్‌తో కూడిన సైకిళ్లను ప్రారంభిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అధికారులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో మొదటి ర్యాంక్ లక్ష్యంగా నగర పరిశుభ్రతతో పాటు కాలువల సుందరీకరణ, మెష్ ఏర్పాటు, గ్రీనరీ పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవడంతో నగర ప్రజలు తమకు సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు. ప్రజలకు దోమకాటు వలన సంక్రమించే వ్యాధులు, దోమలు వృద్ధి చెందకుండా నగరంలోని 64 డివిజన్లలో ముందస్తు జాగ్రత్తల గురించి మైక్ ఎనౌన్స్‌మెంట్ ద్వారా అవగాహన కల్పించేందుకు నూతనంగా కొనుగోలు చేసిన 64 సైకిళ్లు, ట్రీ కటింగ్ మెషిన్స్, హ్యాండ్ ఫాగింగ్ మెషిన్‌లను ఆయన నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం వద్ద సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రీ కటింగ్ మెషిన్స్ ద్వారా నగరంలోని బందరు, ఏలూరు, రైవస్ కాలువలతో పాటు బుడమేరు కాలువలో బుష్ కటింగ్స్ చేసి సుందరీకరణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కేవీ సత్యవతి, సీఎంవోహెచ్ డాక్టర్ పి.రత్నావళి, బయాలజిస్ట్ సూర్యకుమార్, వెహికల్ డిపో ఏఈ కె.యేసుపాదం, శానిటరీ సూపర్‌వైజర్ ఓబేశ్వరరావు, మలేరియా ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన జగన్నాథ రథయాత్ర మహోత్సవాలు



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారిణి



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

ఆటోనగర్(విజయవాడతూర్పు): జగన్నాథ రథయాత్ర మహోత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. చివరి రోజు కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కళాకారులకు మందిర అధ్యక్షుడు చక్రధారిదాస్ బహుమతులను అందజేశారు. విజయవాడ ఇస్కాన్ మందిర ఆవరణలో అందంగా అలంకరించిన గుండిచా మందిరంలో రత్న సింహాసన జగన్నాథుడు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఇస్కాన్ మందిర అధ్యక్షుడు చక్రధారిదాస్ మాట్లాడుతూ.. ఉత్సవాల మూడు రోజుల్లో సుమారు 50 వేల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారన్నారు. ఏపీ టూరిజం వారు ఈ కార్యక్రమాన్ని ఉత్తమ ఫెస్టివల్‌గా ప్రమోట్ చేస్తారన్నారు.

డిగ్రీలో సింగిల్, మేజర్ సబ్జెక్ట్ విధానం రద్దు చేయాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): డిగ్రీ విద్యలో సింగిల్, మేజర్ సబ్జెక్ట్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.అశోక్ అధ్యక్షతన సోమవారం డిగ్రీ విద్యా రంగంలో మార్పులు ఎవరికోసం అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మణరావు మాట్లాడుతూ నేడు ఉన్నత విద్యారంగంలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. మోడీ సర్కార్ తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానం-2020ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం శరవేగంతో అమలు చేస్తూ గత రెండేళ్లలో పాఠశాల విద్యా స్థాయిలో చేపట్టిన సంస్కరణలు ఎంతటి తీవ్ర పర్యవసనాలకు దారి తీశాయో కళ్ల ముందు కనిపిస్తోందన్నారు. విద్యావేత్తలు, మేధావులు, ఆధ్యాపకుల అభిప్రాయాలను సేకరించకుండా క్షేత్రస్థాయిలోని వాస్తవ పరిస్థితులను గమనించకుండా హడావిడిగా ఏకపక్షంగా నిర్ణయాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి భూషణం, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.సోమేశ్వరరావు, వెంకటేశ్వరరావు, ఇతర విద్యార్థి సంఘాల నాయకులు రాజేష్, శ్యాంబాబు, రాజగోపాల్, భార్గవ్, కుమారస్వామి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

జగనన్న సురక్ష నమోదు ప్రక్రియ వేగంగా చేపట్టాలి

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



స్పందనలో అర్జీలను స్వీకరిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): జగనన్న సురక్ష నమోదు ప్రక్రియను వేగవంతం చేపట్టాలని, స్పందన, జేకేసీ అర్జీల పరిష్కారం నాణ్యతతో కూడిన పనితీరు చూపాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలో అధికారులతో కలిసి స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన నగరవాసుల నుంచి అర్జీలను స్వీకరించారు. స్పందనకు వచ్చే ఫిర్యాదులను విభాగాధిపతులే నేరుగా పరిశీలించి పరిష్కరించాలని, ఏ ఒక్క ఫిర్యాదు పునరావృతం కాకుండా శాశ్వత ప్రాతిపదికన పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. తొలుత జగనన్నకు చెబుదాం, స్పందన పోర్టల్, ఈఆర్పీ, వాట్సాప్, కాల్ సెంటర్ల ద్వారా అందిన ఫిర్యాదులపై అధికారులు, సంబంధిత సిబ్బందితో సమీక్షించి ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు.

స్పందనకు 21 ఫిర్యాదులు..

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజల నుంచి జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అందే ఫిర్యాదుల పరిష్కారం పట్ల నేరుగా రాష్ట్ర స్థాయి అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నారని, ఫిర్యాదులను బాధ్యతతో పరిష్కరించాలన్నారు. అలాగే 'జగనన్న సురక్ష' కార్యక్రమం యాక్షన్ ప్లాన్ సచివాలయాల వారీగా నిర్వహించాలన్నారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌ను ఆయా విభాగాధిపతులు పరిశీలించాలని, విభాగాల వారీగా జగనన్నకు చెబుదాం అర్జీలకై ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలన్నారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫొటోలు జత చేయాలన్నారు. సచివాలయ కార్యదర్శులు విభాగాల వారీగా తమ సచివాలయం పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలన్నారు. స్పందన కార్యక్రమానికి 21 ఫిర్యాదులు వచ్చాయన్నారు. వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం -6, ఇంజినీరింగ్ - 6, రెవెన్యూ -5, ప్రజారోగ్యం -2, ఎస్టేట్, ఉద్యానవన విభాగానికి సంబంధించి ఒక్కో ఫిర్యాదు వచ్చిందని చెప్పారు. ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) డి.వెంకటలక్ష్మి, ప్రాజెక్ట్ ఆఫీసర్(యూసీడీ) శకుంతల, జాయింట్ డైరెక్టర్(అమృత్) డాక్టర్ కె.బి.ఎస్.ఎస్ లత, ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఏడీహెచ్ శ్రీనివాసు, మేనేజర్ బి.శ్రీనివాస్‌రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సర్కిల్ కార్యాలయాల్లో రెండు అర్జీలు

సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్లు స్పందన కార్యక్రమం నిర్వహించారు. సత్యనారాయణపురంలోని సర్కిల్ -2 కార్యాలయంలో పట్టణ ప్రణాళిక విభాగానికి చెందిన 2 అర్జీలు వచ్చాయని జోనల్ కమిషనర్లు తెలిపారు.

దుర్గగుడి పరిసరాల్లో జాడలేని టోల్ ఫ్రీ నంబర్ బోర్డులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడిలో జరిగే నిత్య ఆర్జిత సేవలు, ఆలయంలో దర్శనాలు, ఇతర సౌకర్యాల గురించి తెలుసుకోవాలంటే దేవస్థాన టోల్‌ఫ్రీ నంబర్ తెలిసి ఉండాలి.. అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించాలంటే టోల్ ఫ్రీ నంబర్‌లో ముందస్తుగా సమాచారం ఇవ్వాలని ఆలయ అధికారులే పేర్కొంటున్నారు. అటువంటి దుర్గగుడి పరిసరాల్లో ఎక్కడా దేవస్థానం టోల్‌ఫ్రీ నంబర్‌ను ప్రదర్శిస్తూ బోర్డులు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. దుర్గగుడి టోల్ ఫ్రీ నంబర్-1800 425 9099. దేవస్థానంలో జరిగే ఉత్సవాలకు భక్తులను స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసే తాత్కాలిక ఫ్లెక్సీల్లో మాత్రమే ఈ టోల్‌ఫ్రీ నంబర్ కనిపించడం గమనార్హం. అలా కాకుండా శాశ్వత ప్రాతిపదికన ఆలయ ప్రాంగణంలో పర్మినెంట్ బోర్డులు ఏర్పాటు చేయాలి. అమ్మవారి ఆలయంలో జరుగుతున్న నిత్య సేవలు, ఆ సేవల్లో పాల్గొనాలంటే ఎంత మొత్తం చెల్లించాలనే అంశాలను టోల్‌ఫ్రీ నెంబర్ ద్వారా అడిగి తెలుసుకోవచ్చు. దీని కోసం ఆలయ పరిసరాలతో పాటు కనకదుర్గనగర్, దుర్గాఘాట్, దేవస్థాన ఘాట్ రోడ్డుతో పాటు దేవస్థాన బస్సులపై టోల్‌ఫ్రీ నెంబర్‌ను ఫ్లెక్సీల రూపంలో ఏర్పాటు చేస్తే భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. మహా మండపం గ్రౌండ్‌ఫ్లోర్‌లోని రూ.500 టికెట్ల కౌంటర్ చాంబర్‌లో దేవస్థానం టోల్‌ఫ్రీ నంబర్ సెంటర్‌ను నడుపుతుంది. సెంటర్‌కు రెండు షిఫ్టుల్లో ఇద్దరు సిబ్బందిని నియమించి భక్తులు అడిగిన సమాచారం అందిస్తున్నారు. అయితే భక్తులందరికీ తెలిసేలా టోల్‌ఫ్రీ నంబర్‌కు ప్రచారం కల్పించాలి.

ఆషాఢ సారెల సమర్పణ

ఆషాఢ మాసంలో అమ్మవారికి సారె ఇచ్చే భక్తులు, భక్త బృందాలు ముందు రోజు దేవస్థాన టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆలయ అధికారులు మీడియా సమావేశంలో పేర్కొన్నారు. అయితే భక్తులకు టోల్‌ఫ్రీ నంబర్ తెలియకపోవడంతో ఒకే రోజు పదుల సంఖ్యలో.. మరో రోజు ఒకటి, రెండు బృందాలు, కొంత మంది అయితే అసలు దేవస్థానానికి సమాచారం ఇవ్వకుండానే సారె తీసుకువస్తున్నారు. దీంతో మహా మండపం ఆరో అంతస్తులో భక్తులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుంది. టోల్‌ఫ్రీ నంబర్ తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయాలని భక్త బృందాలు కోరుతున్నాయి.

■ ఫుల్ డే స్కూల్స్ షురూ !



నగరంలో సోమవారం నుంచి ఫుల్ డే స్కూల్స్ అమలు చేశారు. దీంతో విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలల బాట పట్టారు. ఎంకే బేగ్ హైస్కూల్‌లో విద్యార్థులకు టీచర్ విద్యను బోధిస్తున్న చిత్రమిది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ.

మత్తు పదార్థాల వినియోగంతో జీవితం అంధకారం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా, నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మత్తు పదార్థాల వినియోగంతో జీవితం అంధకారం అవుతుందని, యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. అంతర్జాతీయ మత్తు పదార్థాల దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నీతోడు మానసిక వికాస కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వాల్‌పోస్టర్లను సింగ్‌నగర్‌లోని తన కార్యాలయంలో సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ రుహుల్లా మాట్లాడుతూ.. నీతోడు మానసిక వికాస కేంద్రం వారు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వాల్‌పోస్టర్లను ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని సూచించారు. ఆ సంస్థ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా వుండాలి

పాయకాపురం(విజయవాడరూరల్): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు, మత్తు పదార్థాలకు దూరంగా వుండాలని ఎస్ఈబీ సీఐ ఈ.స్వరాజ్యలక్ష్మి అన్నారు. పాయకాపురం, రాధానగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై సోమవారం అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ మాట్లాడుతూ విద్యార్థి దశలో క్రమశిక్షణ కలిగి, ఎటువంటి చెడు అలవాట్లకు లోనుకాకుండా ఉండాలన్నారు. తల్లిదండ్రుల ఆకాంక్షలకు, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, మానవహారం ఏర్పాటు చేశారు. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సీఎస్ సత్యనారాయణరెడ్డి, అధ్యాపకులు కె.వెంకటేశ్వరరావు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.